## క్లుప్తంగా

### అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలి



కాజులూరులో ప్రసంగిస్తున్న ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్

కాజులూరు: భూ యజమానితో సంబంధం లేకుండా అర్హులైన ప్రతి రైతుకు రెవెన్యూ అధికారులు కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.రాజశేఖర్ అన్నారు. కౌలు రైతులందరికీ సీసీఆర్సీ కార్డులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర వ్యాప్తంగా కౌలు రైతు సంఘ నాయకులు చేపట్టిన కౌలురైతు రక్షణ యాత్ర బుధవారం కాజులూరు మండల గ్రామాలకు చేరుకుంది. కరప మండలం యండమూరు మీదుగా గొల్లపాలెం చేరుకున్న యాత్ర గొల్లపాలెం, చేదువాడ, తిప్పరాజుపాలెం, కాజులూరు, శీల, శీలలంక మీదుగా సాగింది. సంఘ నాయకులు పాలెపు ఈశ్వరరావు, అల్లాడి నరసింహమూర్తి, వనుం వీరబ్రహ్మం, కురుపూడి రాంబాబు, గంజా అప్పారావు, పెంకే సూర్యనారాయణ, శ్రీనివాస్, లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

### విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

కాజులూరు: తమ ఇళ్లకు ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులతో నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను అధికారులు తిరిగి పునరుద్ధరించాలని శలపాకకు చెందిన కర్రి దుర్గారెడ్డి తదితరులు కోరుతున్నారు. బుధవారం గ్రామంలో వారు విలేకరులతో మాట్లడుతూ గత వారం క్రితం గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోవటంతో మంటలు సంభవించి సమీపంలోని ధాన్యం రాశులు దగ్ధమయ్యాయన్నారు. రైతులు సకాలంలో స్పందించటంతో నష్టతీవ్రత తగ్గిందన్నారు. అయితే ట్రాన్స్‌కో సిబ్బంది పట్టించుకోకపోవటంతో తమ ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయిందన్నారు. ఈ విషయంపై స్థానిక లైన్‌మన్‌కు, గొల్లపాలెం సబ్‌స్టేషన్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్న పట్టించుకోవటం లేదని పైగా పొలాల మధ్య ఇల్లు ఎందుకు కట్టుకున్నారంటూ తమను దూషిస్తున్నారన్నారు. చీకటి పడితే పిల్లలతో కలసి అంధకారంలో అలమటించాల్సి వస్తుందని ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### మూడు నెలల్లో రైతు బజార్ నిర్మాణం



రైతు బజార్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్

రామచంద్రపురం: పట్టణంలో రైతుబజార్ నిర్మాణాన్ని మూడు నెలల్లో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని మార్కెటింగ్ శాఖ చీఫ్ ఇంజినీర్ ఎం.శ్రీనివాస్ తెలిపారు. ఈ మేరకు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. పట్టణంలోని శివాలయం వీధిలోని మున్సిపాలిటీ స్థలంలో నిర్మిస్తున్న రైతు బజార్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. రైతుబజార్‌ను పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని డీఈఈ, ఈఈలను ఆదేశించారు. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ పి.వాసుదేవరావు, ఈఈ శ్రీను, డీఈఈ పాల్, కాంట్రాక్టర్ బావాల భద్రరావు తదితరులు పాల్గొన్నారు.

### విజయవంతంగా వేసవి విజ్ఞాన శిబిరాలు



విజ్ఞాన శిబిరాన్ని పరిశీలిస్తున్న కార్యదర్శి ప్రసాద్

కపిలేశ్వరపురం: జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో గ్రంథాలయాల్లో మే 8 నుంచి నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు విజయవంతంగా నడుస్తున్నాయని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వీఎల్ఎన్ఎస్‌వీ ప్రసాద్ అన్నారు. కపిలేశ్వరపురం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విజ్ఞాన శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించారు. శిబిరంలో రిసోర్స్‌పర్సన్లు వంశీ, భానుతేజలు విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, యోగాలలో తర్ఫీదు ఇచ్చిన తీరును పరిశీలించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి, గట్టి రామారావు పాల్గొన్నారు.

### రైల్వే కౌంటర్ కొనసాగించాలి

మండపేట: అమలాపురంలో దీర్ఘకాలంగా విశేష సేవలందించిన రైల్వే రిజర్వేషన్ కౌంటర్‌ను కొనసాగించాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు తాను మంగళవారం విజయవాడలో రైల్వే డీఆర్ఎం ఎస్.మోహన్, సీనియర్ డీసీఎం వి.రాంబాబులను కలిసి వినతిపత్రాలు అందజేసినట్టు మండపేటలో బుధవారం కామన తెలిపారు. అద్దె భారంతో కౌంటర్‌ను మూసివేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సుమారు 22 సంవత్సరాలుగా కౌంటర్ ద్వారా ప్రయాణికులకు సేవలందాయని గుర్తు చేశారు.

# పొలాల్లో కరెంటు కష్టాలు

- కాలిపోతున్న వీ–క్రాస్ ఆర్మ్ (కేసారం)లు
- ప్రమాదం వస్తే తీవ్ర నష్టం
- రైతులకు అవగాహన ఎంతో అవసరం



పంట పొలాల్లో విద్యుత్ స్తంభాల మీద చిక్కుకుని ప్రమాదాలకు కారణమవుతున్న గడ్డి పరకలు

రామచంద్రపురం: కంటికి కనిపించేందుకు మాత్రం చిన్నదిగానే ఉంటుంది. కానీ పెద్ద ప్రమాదాలు తెచ్చిపెడుతున్నాయి. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోకపోవటంతో పెద్ద ప్రమాదాలను ఎదుర్కొని విద్యుత్ అధికారులు, రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశాలు అధికంగా ఉంటున్నాయి. దీంతో వేసవిలో విద్యుత్ శాఖాధికారులకు కష్టాలు తప్పడం లేదు. పంట పొలాల్లో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి షార్ట్ సర్క్యూట్ అవటం మూలంగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. దీంతో సబ్‌స్టేషన్ల నుంచి విద్యుత్ సరఫరా నిలిచిపోయి కరెంటు కష్టాలు ఏర్పడుతున్నాయి. అంతే కాకుండా విద్యుత్ శాఖకు తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

రెండో పంట సీజన్‌లో వరి కోత మెషీన్ల ద్వారానే ధాన్యం మాసూళ్లు చేస్తున్నారు. దీంతో వరి మెషీన్ల ద్వారా వచ్చిన గడ్డి ఎగిరి కరెంటు స్తంభాల మీద పడుతుంది. దీనికి తోడు అధిక శాతం రామచంద్రపురం మెయిన్ స్టేషన్ నుంచి విద్యుత్ స్తంభాలు మండల గ్రామాల్లోని సబ్ స్టేషన్లకు విద్యుత్ సరఫరా చేస్తున్నారు. పొలాల్లో గల విద్యుత్ స్తంభాల మీద యంత్రాల ద్వారా వచ్చిన గడ్డి ఎరిగి స్తంభాల మీద ఉంటే విద్యుత్ వైర్ల మీద కేసారం (వీ క్రాస్ ఆర్మ్) మీద పడుతుంది. ఎల్లప్పుడు విద్యుత్ ప్రవహించే ఈ తీగల మీద గడ్డి పడటంతో కండక్టర్‌కు, కేసారంకు గడ్డి ద్వారా మంటలు వ్యాపిస్తున్నాయి. చివరకు ఆ మంటలు పెద్ద ప్రమాదంగా మారుతున్నాయి. కేశారంలు మండిపోయి కింద చేలలో ఉండే గడ్డి మీ మంట అంతా ముద్దగా తయారై కిందపడుతుంది. దీని మూలంగా వరి చేలలో ఉండే గడ్డి కూడా కాలిపోయి ధాన్యం రాశులు కాలిపోయే ప్రమాదం ఏర్పడుతుంది. రైతులు ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన ధాన్యం కాలిపోవటంతో పాటుగా విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోతుంది.

**అధికారులకు తప్పని తిప్పలు**

ఇటీవల రామచంద్రపురం మెయిన్ సబ్ స్టేషన్ పరిధిలో మూడు సార్లు వివిధ ప్రాంతాలకు వెళ్లాల్సిన విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమస్యను కనుగొనేందుకు విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది నానా పాట్లు పడ్డారు. చివరకు పొలాల్లో ఉండే విద్యుత్ స్తంభాలపై ఉన్న కేశారంలు కాలిపోవటం మూలంగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి వేళల్లో ప్రధాన సబ్ స్టేషన్‌ల నుంచి మండల గ్రామాలకు వెళ్లాల్సిన విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోయింది. కేవలం గడ్డి విద్యుత్ తీగల మీద పడి మంటల వ్యాపించడం మూలంగానే ఈ సమస్య తలెత్తుతుందని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. విద్యుత్ స్తంభాల మీద ఉంటే కేశారంలు, కండక్టర్లు కాలిపోవటం మూలంగా సబ్‌స్టేషన్‌లో ఫీడర్లు ఆగిపోతుంటాయి. కండక్టర్లు కూడా కట్ అయిపోతుంటాయి. విద్యుత్ సరఫరా పునరుద్ధరించేందుకు ఎక్కడైతే విద్యుత్ సమస్య వచ్చిందో అక్కడకు వెళ్లి కండక్టర్లు జాయింట్లు వేయాలి. అప్పటివరకు సబ్ స్టేషన్లు పనిచేయవు. దీంతో గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు.

**పెద్ద ప్రమాదాలు సంభవించే అవకాశం**



కిలోమీటర్ల మేర దూరం ఉండి రహదారి సౌకర్యం కూడా సరిగ్గా లేని పంట పొలాల మధ్యలో ఇటువంటి సమస్యలు రావటం మూలంగా పెద్ద అగ్ని ప్రమాదాలు సంభవించే అవకాశం ఉంది. విద్యుత్ స్తంభాల నుంచి మంటలు పంట చేలో పడి వ్యాపించే మంటలను ఆర్పటానికి నీళ్లు ఉండవు. ప్రమాదాలు నివారించే మార్గం లేదు. రైతులు అవగాహన చేసుకోవాలి. పంట పొలాల్లోని విద్యుత్ స్తంభాల వైర్ల కింద పనిచేసేటప్పుడు గడ్డి ఎగరకుండా జాగ్రత్తలు తీసుకుంటే ప్రమాదాలు నివారించే అవకాశం ఉంటుంది. వరి పొలాల్లో గడ్డిని రైతులు తగుల బెడుతున్నారు దీని మూలంగా కూడా కరెంటు స్తంభాలపై వైర్లు కట్ అయ్యి ట్రిప్ అయ్యే ప్రమాదం ఉంటుంది. వేసవి ముగిసి రుతుపవనాలు సమీపిస్తున్న నేపథ్యంలో గాలివానలు వస్తుంటాయి. అప్పుడు ఈ ప్రమాదాలు వస్తున్నాయి. దీనిపై రైతులకు అవగాహన చేయాల్సిన అవసరం ఉంది.

– ఎంవీ రమణ, ఏఈ, ఏపీఈపీడీసీఎల్, రామచంద్రపురం

# చెంచాలు కాదు.. మీ గుండెల్లో గునపాలు

- ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాఖ్యలను తిప్పికొట్టిన ఎమ్మెల్సీ తోట
- నోరు అదుపులో పెట్టుకోవాలని హెచ్చరిక
- అభివృద్ధి పనులక శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు



విజయలక్ష్మి నగర్‌లో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: తమ నాయకులు చెంచాలు కాదు.. మీ గుండెల్లో గునపాలు అంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు రెండు రోజుల క్రితం వేగుళ్ల జోగేశ్వరరావు చేసిన వ్యాఖ్యలను తిప్పికొట్టారు. మాట్లాడేటప్పుడు నోరు అదుపులో పెట్టుకోవాలని హితవు పలికారు. మండపేటలో సుమారు రూ. 2.5 కోట్ల విలువైన పలు రోడ్ల, అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్సీ తోట భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ మండపేట, జగ్గంపేట నియోజకవర్గాల పరిశీలకులు రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వేగుళ్ల పట్టాభి రామయ్య చౌదరి, పార్టీ రాష్ట్ర నేతలు రెడ్డి రాజు బాబు, దూలం వెంకన్నబాబు కూడా పాల్గొన్నారు. తన ప్రశ్నకు ఎమ్మెల్సీ తోట నేరుగా జవాబు చెప్పకుండా తన చెంచాలతో మాట్లాడిస్తున్నారన్న ఎమ్మెల్యే వేగుళ్ల చేసిన వ్యాఖ్యలపై తోట ఈ సందర్భంగా ఘాటుగా స్పందించారు. తన వెనకాల ఉన్న వారంతా హోదా కలిగిన వ్యక్తులేనని, తమ పార్టీ నాయకులు, కార్యకర్తలను చులకన చేసి మాట్లాడితే సహించబోనన్నారు. సెల్ఫీ ఛాలెంజే కాదు ఏ ఛాలెంజికైనా తాను వెనక్కి తగ్గనని స్పష్టం చేశారు పట్టణంలో పెద్ద ఎత్తున జరుగుతున్న అభివృద్ధి ఎమ్మెల్యే వేగుళ్ల కంటికి కనిపించడం లేదన్నారు. క్రిస్టియన్ కమ్యూనిటీహాలుకు ఇంకా వంటషెడ్డు, ఇంకా కొన్ని పనులు చేయాల్సి ఉందని వాటి కోసం అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించామన్నారు. పక్కనే ఉన్న ఎస్సీ కమ్యూనిటీ హాలు అభివృద్ధి నిమిత్తం కౌన్సిల్‌లో రూ. 45 లక్షలు మంజూరు చేశామన్నారు. దళితులు, బలహీన వర్గాలంటే ఎమ్మెల్సీ తోటకు ప్రేమ లేదని చెబుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల ఆ విషయంపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు.

**ఎన్నికలకు ముందు సెల్ఫీలు తీసుకోండి**

ఎన్నికలకు మూడు నెలల ముందు ప్రజలను మభ్య పెట్టేందుకు ఎమ్మెల్యే వేగుళ్ల వ్యాను నిండా కొబ్బరికాయలు వేసుకుని కమ్యూనిటీ హాళ్లు నిర్మిస్తామంటూ నియోజకవర్గం అంతటా ఎడాపెడా కొబ్బరి కాయలు కొట్టిపారేశారన్నారు. వాటికి కూడా సెల్ఫీలు తీసుకుని ఛాలెంజ్ చేయాలని ఎమ్మెల్సీ తోట సవాల్ చేశారు. పెద కాలువ వంతెన వద్ద రెండో వంతెన నిర్మాణం ఎందుకు చేశారో? అప్రోచ్ రోడ్డు నిర్మాణం పేరిట వంతెన పక్కన గల మీ భూముల విలువ పెంచుకునేందుకు పేదల ఇళ్లను తొలగించేందుకు మీరు చేసిన ప్రయత్నం గురించి ప్రజలకు తెలుసునన్నారు. కాంగ్రెస్ హయాంలో వీరభద్రపురం, మారేడుబాకల వద్ద నిర్మించిన రెండు వంతెనలను టీడీపీ అధికారంలో ఉన్నపుడు ఎందుకు పట్టించుకోలేదని ఎమ్మెల్సీ తోట ప్రశ్నించారు. ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, మున్సిపల్ వైస్ చైర్మన్లు పిల్లి గణేశ్వరరావు, వేగుళ్ల నారయ్య, విప్ పోతంశెట్టి ప్రసాద్, సొసైటీ చైర్మన్ కుక్కల రామారావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ ఆలీఖాన్ బాబా, పార్టీ అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు పాల్గొన్నారు.

## ఏడిదలో ముగిసిన గడప గడపకూ..



ఏడిదలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: గత 18 రోజులుగా మండలంలోని ఏడిదలో నిర్వహిస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం రాత్రితో ముగిసింది. కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, యువనేత తోట పృధ్వీరాజ్ గ్రామంలోని దేవుడుతాళ్ల కాలనీలో పర్యటించారు. ప్రతి ఇంటికీ వెళ్లి మూడేళ్ల పాలనలో ప్రభుత్వం ద్వారా వారికి చేకూరిన లబ్ధిని వివరిస్తూ, వారి సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు ఆదేశాలిస్తూ ముందుకు సాగారు. కాలనీలో డ్రైన్లు, ఇతర సదుపాయాల కల్పనకు సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, ఎంపీడీఓ ఐ. రాజు, పంచాయతీ కార్యదర్శి వుండమట్ల వీర్రాజులకు ఎమ్మెల్సీ ఆదేశాలిచ్చారు. అనంతరం భావన్నారాయణ స్వామి ఆలయం వద్ద ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రణాళికాబద్ధంగా కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు ఎమ్మెల్సీ తోట అభినందించారు. గ్రామంలో ప్రజల నుంచి వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, వైఎస్సార్ సీపీ నేత కుడిపూడి రాంబాబు, గ్రామ కమిటీ అధ్యక్షుడు పలివెల సుధాకర్, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, ఆర్‌బీకే మండల కమిటీ డైరెక్టర్ చిలుకూరి బుజ్జి, మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు గారపాటి ఆశోక్‌కుమార్, వల్లూరి రామకృష్ణ, తాతపూడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## బడిఈడు పిల్లలు స్కూల్లోనే ఉండాలి



సోమేశ్వరంలోని ఇటుకల బట్టీలో తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయవరం: బడిఈడు పిల్లలందరూ బడిలోనే చదువుకోవాలని, పిల్లల్ని పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తప్పవని ఆల్టర్‌నేటివ్ స్కూల్ కో–ఆర్డినేటర్ డి.రమేష్‌బాబు, ఏఎల్‌వోలు ఎ.విజయప్రకాష్, వి.పద్మావతి సూచించారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనపై మండలంలోని మాచవరం, సోమేశ్వరం, రాయవరం, పసలపూడి గ్రామాల్లో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు.వారు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాల మేరకు ఈ నెల ప్రారంభం నుంచి నెలాఖరు వరకూ ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బడిఈడు చిన్నారులను పనిలో పెట్టుకోరాదని షాపుల యజమానులకు, ఇటుకబట్టీల యజమానులకు సూచించారు. అలాగే చిన్నారుల తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించారు. ప్రస్తుతం అన్ని పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ను ఉపాధ్యాయులు నిర్వహిస్తున్నారన్నారు. బడిఈడు పిల్లలందర్నీ బడిలోనే చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవో పి.రాంబాబు, ఎంఈవో వై.సత్యనారాయణ, సీఆర్పీ కె.పోసిరాములు, చైల్డ్ లైన్ ప్రతినిధి జె.సత్యనారాయణ, జయకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధి ఏఎస్ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

## కౌలు రైతులకు రుణ సదుపాయం



టేకి ఆర్బీకే వద్ద పైలట్ ప్రాజెక్ట్ లక్ష్యాన్ని వివరిస్తున్న మేనేజర్ దేవి



మాచవరం సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి బోసిబాబు

**పైలట్ ప్రాజెక్ట్‌గా టేకి ఆర్బీకే**

కపిలేశ్వరపురం: ఐదేళ్లగా వ్యవసాయం చేస్తూ బ్యాంకుల నుంచి రుణం పొందని కౌలు రైతులకు రుణ సదుపాయం కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తున్నట్టు వ్యవసాయ శాఖాధికారులు, పలు బ్యాంకుల అధికారులు తెలిపారు. అందుకోసం నిర్దేశించిన కార్యక్రమంలో భాగంగా టేకి ఆర్బీకే పరిధిని పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసినట్టు మండల వ్యవసాయాధికారి కేవీఎస్ రమేష్‌కుమార్ తెలిపారు. టేకి రైతు భరోసా కేంద్రంలో బుధవారం సర్పంచ్ కుక్కల నాగమణి అధ్యక్షతన పైలట్ ప్రాజెక్ట్ లక్ష్యాన్ని వివరించేందుకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఓ కేవీఎస్ రమేష్‌కు కుమార్, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ కౌలు రైతులను వ్యవసాయ నిపుణులుగా గుర్తించి వ్యవసాయేతర రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. నిర్దిష్టమైన విస్తీర్ణంలో భూమిని కౌలుకు సాగు చేస్తున్నట్టుగా వీఆర్వో, వ్యవసాయ సహాయకుడు ధ్రువీకరించడం ద్వారా బ్యాంకు రుణం మంజూరవుతుందన్నారు. గ్రామంలో రైతులు, సాగుభూమి, రుణ సదుపాయం పొందని రైతుల వివరాలను ఆర్బీకే వ్యవసాయ సహాయకులు గంజా హరిబాబు తెలియజేశారు. సాగు భూమి, కౌలు రైతులు తగినంత సంఖ్యలో ఉన్న నేపథ్యంలో టేకి ఆర్బీకేను పైలట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేశారన్నారు. గుర్తించిన రైతులకు తమ బ్యాంకు రుణాన్ని మంజూరు చేసే తీరును డీసీసీబీ మేనేజర్ దేవి వివరించారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ మట్టపర్తి పాల్‌రాజు అన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు మల్లేశ్, జాన్, రైతులు పాల్గొన్నారు.

రాయవరం: కౌలు రైతులను గ్రూపులుగా ఏర్పాటు చేసి, వారి రుణాలు అందించేందుకు మండలంలో మాచవరం గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా చేపడుతున్నట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఓలేటి బోసిబాబు తెలిపారు. ఇందుకోసం బుధవారం ఏవో కె.ప్రభాకర్ అధ్యక్షతన మాచవరం గ్రామ సచివాలయంలో కౌలు రైతులను అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ అధికారి బోసి బాబు మాట్లాడుతూ ఐదుగురు కౌలు రైతులను గ్రూపుగా ఏర్పాటు చేస్తామన్నారు. సాగు పెట్టుబడుల కోసం రుణాలు అందించడమే ఈ పథకం ప్రధాన లక్ష్యం అన్నారు.ఈ ప్రక్రియను జూన్ 15 నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏడీఏ ఆలమూరు నాగేశ్వరరావు , ఏవో ప్రభాకర్ ఈ పథకం కింద రుణాలు పొందేందుకు పాటించాల్సిన మార్గదర్శకాలను వివరించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సత్తి వెంకటరెడ్డి, తాడి నారాయణ రెడ్డి, ద్వారంపూడి ఆది రెడ్డి, పడాల శ్రీనివాస రెడ్డి, బసిరెడ్డి మాస్టారు, కత్తుల అప్పారావు ,డిప్యూటీ తాసిల్దార్, వీఆర్వోలు గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## తాగేందుకు చుక్కనీరు కరువు



ప్రభుత్వ కుళాయిల నుంచి తాగునీరు రాక ఖాళీగా ఉన్న బిందెలు, బకెట్లు

కె.గంగవరం: మండలంలోని సుందరపల్లిలో తాగునీటి ఎద్దడి నెలకొంది. గ్రామస్తులు తాగేందుకు చుక్క నీరు దొరక్క అల్లాడుతున్నారు. అసలే వేసవి కావడంతో పాటు ప్రభుత్వ కుళాయిల నుంచి తాగునీరు రాక వారు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామానికి కుందూరు వాటర్ ప్రాజెక్టు నుంచి కె.గంగవరం మీదుగా సుందరపల్లికి పైప్ లైన్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అయితే పైప్‌లైన్‌లో లోపాల కారణంగా గత నెల రోజులుగా ప్రభుత్వ కుళాయిల నుంచి తాగు నీరు సక్రమంగా రావడం లేదు. కుళాయిల ద్వారా వచ్చే నీరు అవసరాల కోసం ఉపయోగిస్తారు. కానీ తాగడానికి పనికి రావని ప్రజలు చెబుతున్నారు. అధికారులు పైప్‌లైన్లను మరమ్మతులు చేసి శాశ్వత పరిష్కారం చూపాలని సుందరపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. దీంతో పాటు తాగునీటి అవసరాలు తీర్చేందుకు గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పనుల జాప్యంతో ప్రయాణికుల ఇక్కట్లు

మండపేట: ద్వారపూడి రోడ్డు నిర్మాణంలో జరుగుతున్న జాప్యంతో రాకపోకలు సాగించేందుకు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఎమ్మెల్సీ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. టీడీపీ నాయకులతో బుధవారం ద్వారపూడి రోడ్డులోని తాపేశ్వరం వద్ద సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. త్వరితగతిన పనులు పూర్తిచేయకుంటే ప్రత్యక్ష పోరాటం చేస్తామని ఎమ్మెల్యే వేగుళ్ల పేర్కొన్నారు.





మలికిపురం మండలం కత్తిమండలో రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు కుమారుడి వివాహానికి హాజరైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హెలీప్యాడ్ వద్ద కలసి పుష్పగుచ్ఛం అందించారు.

### పేదలకు అన్నదానం



బస్టాండు వద్ద పేదలకు ఆహార ప్యాకెట్లు అందిస్తున్న సుధాకర్

మండపేట: పట్టణంలోని ఫుట్‌పాత్, బస్టాండు తదితర ప్రాంతాల్లోని పేదలకు బుధవారం మండలంలోని ఏడిద వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు, ఏఎంసీ డైరెక్టర్ పలివెల సుధాకర్ ఆహార ప్యాకెట్లు, పండ్లు అందజేశారు. ఏడిదకు చెందిన పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని కలువ పువ్వు, రాజారత్న, రథంగుడి, మారేడుబాక సెంటర్లు, పెద కాలువ వంతెన తదితర ప్రాంతాల్లో రోడ్డు పక్కన జీవిస్తున్న దాదాపు 150 మంది పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. పార్టీ నాయకులు పైడిమల్ల రాజు. పువ్వల సుధాకర్. వేమగిరి సతీష్. పి సుబ్బు. ఎస్. జయ శేకర్. చంద్రమల్ల అశోక్. చిన్న రాజు తదితరులు పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్ ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు



బూరిగ ఆశీర్వాదం

మండపేట: కాంట్రాక్ట్ ఉద్యోగుల చిరకాల కోరిక నెరవేర్చడం ద్వారా వారి జీవితాల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని ఏడిద పంచాయతీ సర్పంచ్, ఏపీ ఎన్‌జీఓ సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, జేఏసీ మాజీ చైర్మన్ బూరిగ ఆశీర్వాదం అన్నారు. ఏడిద పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు గత ప్రభుత్వాలు హామీలు ఇచ్చానా అమలు చేయలేదన్నారు. రెగ్యులర్ చేయాలని కోరుతూ కాంట్రాక్ట్ ఉద్యోగులతో కలిసి ఏపీఎన్‌జీవో సంఘం అధ్యక్షుడిగా తాను 26 ఏళ్ల పాటు ఎన్నో ప్రభుత్వాలు చుట్టూ తిరిగినా ఫలితం లేకపోయిందన్నారు. గతంలో దివంగత వైఎస్సార్ 2009లో ఆరోగ్య శాఖలోని ఏఎన్ఎంల సర్వీసులను క్రమబద్ధం చేయగా తండ్రికి తగ్గ తనయునిగా సీఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని శాఖల్లోని కాంట్రాక్ట్ ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధం చేయడం ఆనందంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.

### అగ్రికల్చర్ ప్రొఫెషనల్ లోనింగ్‌కు ఏరుపల్లి ఎంపిక

రామచంద్రపురం రూరల్: ప్రభుత్వం కౌలు రైతులకు అందిస్తున్న అగ్రికల్చర్ ప్రొఫెషనల్ లోనింగ్‌కు మండలంలోని ఏరుపల్లి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ ఎంపిక చేసినట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు ఏవీఎస్ రంగారావు తెలిపారు. మండలంలోని ఏరుపల్లిలో కౌలు రైతుల రుణాలపై సర్పంచ్ మల్లిమొగ్గల శ్రీధర్ అధ్యక్షతన అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఏడీఏ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి వివరాలను తెలియజేశారు. మండల వ్యవసాయాధికారి ఎస్.సత్యప్రసాద్ మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టులో భాగంగా కౌలు రైతులు గ్రూపులుగా ఏర్పడి డీసీసీబీ ద్వారా ఎటువంటి సీసీఆర్‌సీ కార్డులు లేకుండా రుణాలు పొందవచ్చని తెలిపారు. గ్రామ స్థాయిలో వ్యవసాయాధికారి, వీఆర్వోలు వాస్తవ సాగుదారులను గుర్తించి వారిని ధ్రువీకరించి తరువాత డీసీసీబీ బ్యాంకులను సిఫారసు చేసిన అనంతరం రుణం మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి మనోహర్, రెవెన్యూ, డీసీసీబీ అధికారులు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పళ్ల ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### వాటర్‌ప్లాంట్ పునఃప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ బేబి తదితరులు

కె.గంగవరం: మండలంలోని కోటిపల్లి పంచాయతీలో బుధవారం వాటర్ ప్లాంట్‌ను పునఃప్రారంభించారు. గత రెండు నెలల క్రితం వాటర్ ప్లాంట్ పాడైపోవడంతో కోటిపల్లి గ్రామ ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో రూ.3 లక్షల మండల పరిషత్ నిధులతో గ్రామ సర్పంచ్ పెమ్మాడి బేబి వాటర్‌ప్లాంట్‌ను బాగు చేయించి కొత్త మెషినరీని ఏర్పాటు చేశారు. ఈ ప్లాంట్‌ను గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ పప్పుల మసేను వెంకన్న (రేవు శ్రీను)తో కలసి సర్పంచ్ ప్రత్యేక పూజలు చేసి మోటార్ స్విచాన్ చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సరఫరా విషయంలో ఎటువంటి ఇబ్బంది లేకుండా తగిన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. గ్రామ పెద్దలు పెమ్మాడి సత్తిబాబు, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ నాయకులు అయినవిల్లి మాధవ్, పాలకవర్గ సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### మండల ఇంజినీరింగ్ జేఈగా మురళీకృష్ణ

ఆలమూరు: మండల ఇంజినీరింగ్ జేఈగా కోటిపల్లి మురళీకృష్ణ నియమితులయ్యారు. ప్రస్తుతం మండల ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న కొత్తపేట ఇంజినీరింగ్ జేఈ డి.వీరభద్రరావు నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ప్రస్తుతం మురళీకృష్ణ రాజమహేంద్రవరంలోని జిల్లా ఇంజినీరింగ్ కార్యాలయంలో ప్రత్యేక అధికారిగా పనిచేస్తూ బదిలీపై మండలానికి విచ్చేశారు. గతంలో జేఈగా పనిచేసిన అనుభవంతో మండలంలో చేస్తున్న అన్ని అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేసి మండలాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని జేఈ తెలిపారు.